# నువ్వా నేనా.. ప్రచారహోరు

**ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు**



**గెలుపుకోసం తీవ్రంగా శ్రమిస్తున్న అభ్యర్థులు**
**మారుతున్న రాజకీయ సమీకరణాలు**
**వ్యూహాలకు పదును పెడుతున్న ప్రధాన పార్టీలు**

హైదరాబాద్ నవంబరు 19 ప్రభాతవార్త : ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్ల వేటలో నిమగ్నమయ్యారు. ప్రచారం ఊపందుకోవడంతో గెలుపు గుర్రమెక్కేందుకు రాజకీయ క్రీడకు తెరలేపారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికలు తేదీలు దగ్గర పడుతుండటంతో నగరంలో పలు పార్టీలకు చెందిన అసెంబ్లీ అభ్యర్థులు తమ నియోజకవర్గంలోని నాయకులను కలుపుకుని ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీలతో పాటు పాతబస్తీలో ఎంఐఎం అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. అన్ని పార్టీలు ప్రచారరథాలను ఏర్పాటు చేసుకొని కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఏ బస్తీలో చూసినా, పలు పార్టీలకు చెందిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో నిండిపోయాయి. ఏ పరిస్థితిల్లోనైనా విజయం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు, కుల సంఘాలతో మహిళ, కాలనీ, సంక్షేమ సంఘాల అభ్యర్థులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు హామీల మీద హామీలను కురిపిస్తున్నారు. దీంతో పలు పార్టీల మధ్య ప్రచారం హోరాహోరీగా కొనసాగుతోంది. పోలింగ్ సమీపిస్తుండటంతో అభ్యర్థుల్లో పోరు రసవత్తరంగా మారుతోంది. దీంతో బస్తీల్లో ప్రచార హోరు రణరంగాన్ని తలపిస్తోంది. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం అభ్యర్థులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**బలం..బలహీనతలపై ఆరా..** ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తున్న అభ్యర్థులు తమ గెలుపునకు కలిసొచ్చే ఏ అంశాన్నీ విడిచిపెట్టకుండా సమీక్షిస్తున్నారు. ప్రచారానికి తొమ్మిది రోజుల సమయమే ఉండడంతో అనుచరులతో నిత్యం వ్యూహ, ప్రతివ్యూహాలపై చర్చిస్తున్నారు. ఏ బస్తీ, ఏ కాలనీ, ఏ మున్సిపల్ డివిజన్‌లో ఎక్కువ ఓట్లు వస్తాయి. ఎక్కడ తక్కువగా పోల్ అవుతాయనే లెక్కలు వేసుకుంటున్నారు. బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు ఏ నాయకుడిని తమ వైపు తిప్పుకోవాలి, అక్కడ ప్రచారం ఎలా చేయాలనే అంశంపై చర్చిస్తూ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి బలం, బలహీనతలపై కూడా దృష్టి సారిస్తున్నారు. దాదాపు అన్ని నియోజవర్గాలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తుండగా, పాతబస్తీలో మాత్రం ఎంఐఎం-కాంగ్రెస్-బిజెపి మధ్యే పోటీ కనిపిస్తోంది. దీంతో అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా హోరాహోరీగా పోరాడుతున్నారు.

**వ్యూహాలు..ప్రతివ్యూహాలు..** ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రచారానికి మిగిలిన సమయాన్ని వృథాచేయకుండా ప్రజల్లోకి వెళ్తున్నారు. అలాగే గెలుపోటములను ప్రభావితం చేయగలిగిన నాయకులు, కార్యకర్తలతో టచ్‌లో ఉంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుల బలాబలాలపై ఆరా తీస్తూ పోల్ మేనేజ్‌మెంట్‌పై జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల మంత్రాంగంపై దృష్టిసారించారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎన్ని ఓట్లు ఉంటాయి. అక్కడ ఏజెంట్లుగా ఎవరిని నియమించాలనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రధాన అనుచరులతో క్షేత్రస్థాయిలో పరస్థితులను బేరీజు వేస్తూ అందుకు అనుగుణంగా నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఓటర్లను ప్రభావితం చేయగలిగే నాయకులకే బాధ్యతలు అప్పగిస్తూ రోజూ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. తాము గెలిస్తే చేసే పనులను ఆయా నాయకులకు వివరించి ఓటర్లకు చేరవేసేలా దిశానిర్దేశం చేస్తున్నారు.



# ఇద్దరు ఘనాపాటీల వసూళ్లు రూ.కోట్లలో

**అవినీతికి కేరాఫ్ సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్ కార్యాలయం**
**ఒక్కో కమర్షియల్ భవనానికి రూ.30లక్షలకు తగ్గకుండా వసూళ్లు**




23 సర్కిల్ కార్యాలయం

కూకట్‌పల్లి, నవంబరు 19 ప్రభాతవార్త: ఎన్నికల ఏర్పాట్లలో జిహెచ్‌ఎంసి కమిషనర్ బిజీగా ఉండడంతో ఇదే అదనుగా భావించిన మూసాపేట సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్(డీసీ) కార్యాలయం, అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ఇద్దరు అదికారులు తాము ఏమి చేసినా ఎవరూ దృష్టిసారించరని భావించి, ఇష్టారాజ్యంగా రూ. కోట్లలో వసూళ్ళు చేసి తమ జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు ఇద్దరు అధికారులు తమ కార్యాలయాలను అవినీతికి అడ్డాలుగా మార్చి, తమ కింద పనిచేసే టీపీఎస్‌లతోపాటు చైన్‌మెన్లు, మధ్య వర్తులు, లైసెన్స్ ప్లానర్లతో అక్రమ వసూళ్ళ దందాకు దిగడం విస్మయానికి గురిచేస్తుంది. కెపిహెచ్‌బికాలనీ, బాలాజీనగర్, మూసాపేట , అల్లాపూర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు కొందరు అధికారులకు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. సదరు అధికారులకు రూ.కోట్లలో అక్రమ ఆస్తులు ఉన్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి.

**రూ.కోట్లలో వసూళ్ళు ఇలా..** మూసాపేట సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్(డీసీ) కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి తోపాటు అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తోన్న మరో అధికారి జేబులు నింపుకోవడానికే పరిమితమె రూ.కోట్లలో వసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి ఇద్దరు అవినీతి ఘనాపాటీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ టీపీఎస్‌లు, మధ్యవర్తులు, చైన్‌మెన్లతో అక్రమ నిర్మాణాలు సక్రమంగా కొనసాగేందుకు వీరితో వసూళ్ళు చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ బహుళ లంతస్తుల భవనం వద్ద రూ.20లక్షలకు తగ్గకుండా మామూళ్ళు, ఇక పెద్ద పెద్ద భవనాలు , అక్రమ కమర్షియల్ నిర్మాణాలు అయితే రూ. 30 లక్షలకు పైగా నిర్మాణదారులు, బిల్డర్ల వద్ద అక్రమ వసూళ్ళను చేయిస్తున్నారని తెలిసింది. సర్కిల్ 23లోని పలు ప్రాంతాల్లో అనేక మంది టీఎస్‌బీపాస్‌తో అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్దంగా ఐదారు అంతస్తుల్ని నిర్మిస్తున్నా ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ఏసీపీతో పాటు డిప్యూటీ కమిషనర్ అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు సదరు అధికారులపై ఉన్నాయి. స్వయంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఆదేశిస్తున్నా సర్కిల్ 23 టౌన్‌ప్లానింగ్‌లో కొందరు అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. టీఎస్‌బీపాస్‌తో అనుమతి తీసుకుని అందుకు విరుద్దంగా నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సదరు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయవచ్చు. పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్దంగా వెలుస్తున్న కమర్షియల్ భవనాలతోపాటు ఐదారు అంతస్తుల వరకు వెలుస్తున్న అక్రమ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు సర్కిల్ ఏసీపీతోపాటు కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా జిహెచ్ ఎంసి ఆదాయం కూడా పెరుగాల్సి ఉంటుంది. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటుపడి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే, ముడుపులు అప్పగిస్తేనే అక్రమ నిర్మాణం సక్రమంగా కొనసాగుతుంది పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం అధికమవుతున్నది. బిల్డర్లు ఓ వైపు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మరో వైపు తీసుకున్న అనుమతులకు విరుద్దంగా నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా అనుమతులు సాధించి బహుళ అంతస్తుల భవనాల్ని బిల్డర్లు చక చకా నిర్మించేస్తున్నారు. అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బిల్డర్లు, అక్రమ నిర్మాణదారులకు తమ వంతుసహకారం అందిస్తుండడంతో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన సర్కిల్ 23 కార్యాలయంలోని కొందరు అధికారులు మామూళ్ళ మత్తులో మునిగి తేలుతున్నారు.

# నగరంలో ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఫీవర్

■ పెళ్లిళ్లు, పార్టీల మీటింగ్‌ల వద్ద భారీ టివి స్క్రీన్‌లు
■ టివిల ముందు పార్టీల నేతలు ■ నిర్మానుష్యంగా మారిన రోడ్లు





**పెళ్లిలు, పార్టీ మీటింగ్ వద్ద టివి స్క్రీన్‌లు..** నగరంలోని పలు ప్రాంతాల్లో పెళ్లిలు, రాజకీయ పార్టీల నేతల సమావేశాల వద్ద ఆదివారం భారీ టివి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.

ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త : ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఫీవర్ నగరాన్ని తాకింది. నగరంలో ఎక్కడ చూసిన క్రికెట్ మ్యాచ్ సందడి కనిపించింది. పెళ్లిలు,రాజకీయ పార్టీల నేతలల మీటింగ్‌ల వద్ద ప్రత్యేకంగా భారీ టివి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కొందరు ప్రైవేటు సంస్థల నిర్వహకులు భారీ టివి స్క్రీన్‌లు ఏర్పాటు చేసి మద్యం, భోజనాలు ఏర్పాటు చేసి ప్రేక్షకుల కోసం తగు ఏర్పాట్లు చేశారు. భారత్ జట్టు ఫైనల్ మ్యాచ్‌కు చేరడంతో ఉదయం నుంచే మ్యాచ్ వీక్షించేందుకు తగు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆదివారం పెళ్లిలు అధిక సంఖ్యలో ఉండడంతో పలు చోట్ల కల్యాణ మండపాల వద్ద ప్రత్యేకంగా భారీ స్కీన్‌లు ఏర్పాటు చేయడం గమన్హారం. మధ్యాహ్నం రెండు గంటలకు మ్యాచ్ ప్రారంభం కాగా, అప్పటికే పలు చోట్ల రాజకీయ పార్టీల నేతలు ప్రచారాలు నిలిపివేసి టివిల ముందు ప్రత్యక్షమయ్యారు. కొందరు నేతలు ఇళ్లకే పరిమితం అయి టివిలకు అత్తుకునిపోయారు. భారత్ జట్టు విజయం సాధిస్తుందని కొందరు నేతలు ముందుగానే కార్యకర్తలకు టీషర్టులు అందజేశారు. వీటిని ధరించి రోడ్లపై ప్రచారం సాగించారు. భారత్ జట్టు విజ యం సాధించాలని కొందరు పార్టీల నేతలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు 240 పరుగులు చేసి ఆస్ట్రేలియాకు 241 టార్గెట్ విధించింది. భారత జట్టు ఆటగాళ్లు బ్యాటింగ్‌లో తడబడడంతో తక్కువ స్కోర్‌కే పరిమితం అయ్యారు.

# విజయంపై ఎవరి ధీమా వారిదే

**కూకట్‌పల్లిలో ఊపందుకున్న ప్రచార హోరు ● ప్రచారంలో దూసుకుపోతున్న అభ్యర్థులు**




1. బిఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు
2. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్
3. బిజెపి, జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 19, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజవర్గంలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీలలో ప్రచారం మరింత ఊపందుకుంది. స్థానికంగా ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి బలపరిచిన జనసేన అభ్యర్థులు ముగ్గురు పోటాపోటీగా తమదైన శైలీలో ప్రచారం చేసుకుబోతున్నారు. అయితే ముందుగా బిఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ శాసన సభ్యులు మాధవరం కృష్ణారావును ఆ పార్టీ ప్రకటించడంతో అప్పటి నుండే మాధవారం కృష్ణారావు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి మొదటి దఫా ప్రచారాన్ని పూర్తి చేసుకున్నాడు. ప్రచారంలో మరింత దూకుడు పెంచుతూ అభిమానుల ఆధ్వర్యంలో ప్రచారాన్ని ప్రారంభించి అందరికంటే ముందు వరుసలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాస్త ఆలస్యంగా టికెట్ తెచ్చుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబడిన ప్రముఖ పారిశ్రామికవేత్త బండి రమేష్ ప్రచార కార్యక్రమాన్ని అన్ని డివిజన్‌లలో ముమ్మరం చేస్తూ ప్రతిరోజు నియోజకవర్గ ప్రజలను పాదయాత్రల ద్వారా నేరుగా కలుస్తు మద్దతును కూడగట్టుకుంటున్నాడు. మరోవైపు అతని భార్య, కూతురు సైతం ప్రచారాన్ని చూపడుతూ మహిళలను కలుస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి బండి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. వీరికి తోడు కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ సత్యంశ్రీరంగం ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ రెబల్ అభ్యర్థి గొట్టిముక్కల వెంకటేశ్వరరావు వారి వారి వర్గాలతో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తూ వస్తున్నారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ బలపరిచిన జనసేన అభ్యర్థి లైన్స్ క్లబ్ సభ్యులు ప్రముఖ బిల్డర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కూడా ఏ మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా నియోజకవర్గంలో అన్ని డివిజన్లను ఇప్పటికే చుట్టేసి ప్రచారంలో తనదైన శైలిని చూపించాడు. బిజెపి నాయకులు, కార్యకర్తలు ఒకవైపు జనసేన కార్యకర్తలతో మరోవైపుగా కలిసి నియోజకవర్గంలోని సెటిలర్ల మద్దతు కూడగట్టుకుని విజయం సాధించే దిశలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కుటుంబ సభ్యులు సైతం ఇంటింటికి తిరుగుతూ మహిళల వద్దకు వెళ్ళి గ్లాసు గుర్తుకు ఓటు వేసి ప్రేమ కుమార్‌ని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరుతున్నారు.

**కూకట్‌పల్లిలో గెలుపుపై ఎవరి ధీమా వారిదే..** ప్రచారంలో ప్రధానమైన మూడు పార్టీలు నువ్వా నేనా అన్న ట్టుగా పోటీ పడుతు న్నాయి. ఖైరతాబాద్ నియోజక వర్గ పున ర్విభజన తరువాత 2019లో కూకట్‌పల్లి కొత్త నియోజకవర్గంగా ఆవిర్భవించిన సమయంలో లోక్‌సత్తా పార్టీ నుండి జయప్రకాష్ నారాయణ 15వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుండి మొదటిసారి టికెట్ తెచ్చుకున్న మాధవరం కృష్ణారావు టిఆర్ఎస్ అభ్యర్థి గొట్టిముక్కల పద్మారావుపై 43వేల ఓట్లతో గెలుపొందారు. తదనంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి టిఆర్ఎస్ నుండి పోటీ చేసిన కృష్ణారావు టిడిపి అభ్యర్థి నందమూరి సుహాసినిపై 41వేల మెజార్టీతో విజయం సాధించారు. కాగా ఈ ఎన్నికల్లో కూడా తాను చేసిన అభివృద్ధి తనను విజయతీరాలకు చేరుస్తుందని మాధవరం గట్టి నమ్మకంతో ఉన్నారు. అయితే ప్రధానంగా సెటిలర్ల ఓట్లు ఎక్కువగా ఉన్న ఇక్కడి నియోజకవర్గంలో ఎన్నికలు రసవత్తరంగా మారి సెటిలర్లు ఏవైపు మొగ్గు చూపుతారో వారే గెలుస్తారని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెటిలర ్ల ఓట్లు మాకే పడతాయని గెలుపు తమనే వరిస్తుందని అటు కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్‌తో పాటు ఇటు బిజెపి బలపరిచిన జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌లు ధీమాగా ఉన్నారు.

# వ్యాపారి దారుణ హత్య

పేట్ బషీరాబాద్, నవంబర్ 19, ప్రభాతవార్త : హైదరాబాద్ నగరంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భాగ్యలక్ష్మీ కాలనీలో కైలాష్ చౌదరి (38) అనే వ్యాపారి ఆదివారం ఉదయం గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. చౌదరి తలపై సుత్తితో దారుణంగా కొట్టడంతో ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలను సేకరించిన పోలీసులు ప్రాథమిక విచారణలో వివాహేతర సంబంధమే చౌదరి హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.



హత్యకు గురైన కైలాష్ చౌదరి

# రాజేంద్రనగర్‌లో దూసుకుపోతున్న కారు

**పరుగందుకున్న కమలం ❒ ఆశించిన స్థాయిలో కనపడని కాంగ్రెస్**

**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రచారంలో "కారు" దుమ్ము లేపుతుంది. నామినేషన్ల పర్వం ముగిసే నాటికే ఓ దఫా ప్రచారంను ముగించుకొని ప్రత్యర్థి పార్టీలకు అందనంత ముందంజలో ఉంది. ఇప్పుడు రెండో దఫా ప్రచారంను కొనసాగిస్తుంది. స్థానిక నాయకులు ఉదయం 8.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటింటి ప్రచారంను జోరుగా కొనసాగిస్తున్నారు. అధికార బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ రోజుకో మండలంలో రోడ్ షోలతో దూసుకుపోతున్నాడు. ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు మంగళ హారుతులతో ఆహ్వానిస్తూ మరోమారు మీకే అండగా నిలబడుతామని బాసలు చేస్తున్నారు. యువ నాయకులు ఎమ్మెల్యే తమను ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలన్న తపనతో భారీ గజమాలలు వేసి సంబరపడుతున్నారు.**

నార్సింగి, నవంబర్ 19 ప్రభాతవార్త : ఎక్కడికెళ్లిన జై తెలంగాణ.. జైజై తెలంగాణ... నినాదాలతో గులాబీ అభ్యర్థి ప్రచారం, రోడ్‌షోలు మారుమ్రోగుతున్నాయి. ఆయా ప్రాంతాలు సైతం గులాబీ రంగు జెండాలు, కార్లతోనే దర్శనమిస్తున్నాయి. వరుసగా మూడు సార్లు ఇదే నియోజకవర్గం నుంచి అధికార పార్టీ అభ్యర్థి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రచారం చేయాలో ఆరి తేరాడు. తన ప్రత్యర్థులైన బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం అభ్యర్థులు ఎమ్మెల్యే ఎన్నికలలో తొలిసారి బరిలో నిలువడంతో వారిని తన ప్రచార ధాటితో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. వారి ఊహకందని విధంగా ప్రచారంను నిర్వహిస్తూ ప్రజలకు 15.ఏళ్లుగా తాను చేసిన అభివృద్ధిని వివరిస్తూ మునుముందుకు వెళ్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఏ రకంగా చూసినా అధికార బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఇప్పటి వరకైతే ప్రచారంలో ముందంజలోనే కనిపిస్తున్నారు.

**పరుగందుకున్న బిజెపి..** రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఎంతో శ్రమకోర్చి టికెట్‌ను దక్కించుకున్నారు. చాలా మంది సీనియర్ నేతలు ఈ సారి తమకు టికెట్ రావాలని తీవ్రంగా శ్రమించినా తనకే దక్కించుకోవడంలో సఫలం అయ్యారు. టికెట్‌ను దక్కించుకోవడంలో సఫలం అయినట్లే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో "కాషాయం" జెండాను తొలిసారిగా ఎగురవేయడంలో సైతం విజయం సాధిస్తానన్న ధీమాను ఆయన వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ పర్వం ముగించుకున్న తరువాత ప్రచార పర్వంలో పరుగులు పెడుతున్నారు. రెండుమార్లు అధికార బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఢీకొని మైలార్‌దేవుపల్లిలో కార్పొరేటర్‌గా గెలుపొందడం ఆయనకు ఈ ఎన్నికల ప్రచారంలో కలిసి వస్తుంది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నేతపై విజయం సాధించాలంటే ఏ ఏ అస్త్రాలు సంధించాలో వాటిని పదును చేసి ప్రచారంలో సంధిస్తున్నారు. బీజెపి అభ్యర్థి తన ప్రచారంలో సంధిస్తున్న ప్రశ్నలకు అధికార పార్టీ నాయకుల నుంచి సరైన సమాధానాలు రావడం లేదు. సూటిగా ప్రశ్నించినా సరైన సమాధానాలు చెప్పలేక చతికిల పడుతున్నారు. తన కోటా నిధులను కూడా ఖర్చు చేయలేని పిసినారి ఎమ్మెల్యే ఉంటే మన నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందని ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, తమ కోటా నిధులతో పాటు కోట్లాది రూపాయల అదనపు నిధులను తమ ప్రాంతాలకు తరలించుకెళ్లి అభివృద్ధి చేయిస్తుంటే మన ఎమ్మెల్యే తన కోటాను కూడా ఖర్చు చేయలేకపోతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. మొదట్లో కొంత నెమ్మదిగా ఉన్న ప్రచార పర్వం ఇప్పుడు అధికార పార్టీని అడుగడుగునా ప్రశ్నిస్తూ పరుగులు పెట్టిస్తున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు భారీ రోడ్‌షోలు కూడా నిర్వహిస్తు కాషాయ దండులో నూతనోత్తేజాన్ని తీసుకు వస్తున్నారు. మూడు మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఓ కార్పొరేషన్‌లలో ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు నయోజోష్‌తో ప్రచారం కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున బిజెపి ప్రచారంలో కనిపిస్తున్నారు. భారత్ మాతాకీ జై... జై శ్రీరాం... జైజై శ్రీరాం... నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి వంటి నినాదాలతో బిజెపి ప్రచార ప్రాంగాణాలు దద్దరిల్లిపోతున్నాయి. బిఆర్ఎస్‌కు ధీటుగానే ప్రచారంను కొనసాగించడంలో బిజెపి సఫలవుతుంది.

**ఆశించిన స్థాయిలో కానరాని కాంగ్రెస్ ప్రచారం..** రాజేంద్రనగర్‌లో తొలిసారి ఎమ్మెల్యే టికెట్‌ను దక్కించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ అసమ్మతి నేతలను తన దారిలోకి తీసుకు రావడంలో విఫలమవుతూ, ఆశించిన స్థాయిలో ప్రచారం చేయలేక పోతున్నారు. 40.ఏళ్లుగా పుప్పాలగూడ గ్రామంలో రాజకీయం చేస్తూ తిరుగులేని కాంగ్రెస్ నాయకుడిగా ఎదిగారు. సర్పంచ్‌గా, మణ కొండ మున్సిపల్ చైర్మన్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల చేత శభాష్ అనిపించుకున్నా, నియోజకవర్గ స్థాయిలో ఆ ఊపు తీసుకు రాలేక పోతున్నారు. రెండు మార్లు ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా కొట్లాడిన బలమైన నాయకుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఇప్పటి వరకు ఎక్కడా కూడా కాంగ్రెస్ ప్రచారంలో కానరాలేదు. ఆరు నెలల నుంచి శంషాబాద్ మండలంలోని ప్రతీ గ్రామంలో గడప గడపకు తిరిగి హాత్‌సేహాత్ జోడో యాత్రను నిర్వహించి బలమైన క్యాడర్‌ను తయారు చేసుకున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు, గండిపేట మండలంలో కూడా తనకంటే బలమైన క్యాడర్ ఉంది. తీరా టికెట్ తనకు దక్కకపోవడంతో ఆయన అలకబూనారు. ఇలాంటి బలమైన నేతను తన వైపుకు తిప్పుకోవడలంలో ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి విఫలమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి బలంగా వీస్తున్నా తరుణంలో రాజేంద్రనగర్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రజలలోకి వెళ్లడం లేదన్న వాదనలు వినిపిస్తునాయి. 15.ఏళ్ల అధికారంలో లేకున్నా ఇప్పటికీ రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ పార్టీకి గ్రామ గ్రామాన బలమైన క్యాడర్ ఉంది. దాన్ని గుర్తించి, సీనియర్ నేతలను తన దారిలోకి తీసుకు రావడంలో, అలకబూనిన నేతలను పార్టీ ప్రచారంలో పాల్గొనేలా చేయడంలో కాంగ్రెస్ అభ్యర్థి సఫలం కాలేకపోతున్నాడు. రాష్ట్రస్థాయి నేతలను రంగంలోకి దింపి సీనియర్లు, అలకబూనిన నేతలను ప్రచార రంగంలో దింపి బిఆర్ఎస్, బిజెపిలకు ధీటైన సమాధానం ఇవ్వాలని, రాజేంద్రనగర్‌ను "హస్త"గతం చేసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు ఆశపడుతున్నారు.

# మంచి స్పార్క్ ఉన్న కవిత్వం 'గాలిలేనిచోట'

చిక్కడపల్లి, నవంబరు 19ప్రభాతవార్త: తండ హరీష్‌గౌడ్ వస్తువైవిధ్యమైన కవి అని ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డిడ అన్నారు. ప్రముఖ కవి కోడూరు విజయకుమార్ అధ్యక్షతన యువకవి తండ హరీష్‌గౌడ్ కవిత్వం 'గాలినేని చోట' పుస్తకావిష్కరణ సభ ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కొత్తతరం కవులు చాలా భిన్నమైనశైలిలో కవిత్వం రాస్తున్నారని, హరీష్ కవిత్వానికి సజీవ తత్వం ఉందన్నారు. కృతిస్వీకర్త, ప్రముఖ కవి, విమర్శకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం కన్వీనర్ ఎస్.రఘు మాట్లాడుతఊూ తండ హరీష్ మంచి స్పార్క్ ఉన్న కవి అని అన్నారు. తన దగ్గర పరిశోధకుడిగా వచ్చిన హరీష్ నేడు ప్రముఖ కవిగా, ఎన్నో పురస్కారాలను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

# అభివృద్ధి చేశాను ఆదరించండి : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ఇంటింటి ప్రచారం చేస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, నవంబర్ 19 ప్రభాతవార్తః పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్‌లోని పొట్టి శ్రీరాములునగర్, జీవైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్‌రూమ్ కాలని వాసులు, గాంధీనగర్ కమిటీ హాల్‌లో గాంధీనగర్ వాసులు సోమన్న మఠంలో, అభిటెట్ అలైట్ అపార్ట్‌మెంట్‌లో, అరుణ్‌జ్యోతి కాలనీ, దేవినగర్‌లలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సీసీనగర్‌లో ఇంటింటి ప్రచారం జరిపారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సరైన సౌకర్యాలు లేక ఇరుకైన ఇండ్లలో పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల మేరకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చిందని తెలిపారు. అదేవిధంగా సొంత ఇల్లు లేని పేద మధ్య ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో నగరంలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి ఇప్పటి వరకు 70వేల ఇండ్లను అర్హులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు ఇండ్ల నిర్మాణం కోసం నామమాత్రపు ఆర్థిక సహాయం అందించాయని విమర్శించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో అన్ని వేళలా అందుబాటులో ఉండే తనకు ఓట్లువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్ హేమలత, వెంకటేషన్ రాజు, రమణ, ప్రేమ్, అబ్బాస్, రజాక్, అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సెక్రటరీ మహేందర్ పాల్గొన్నారు.

## బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో
# పోటా పోటీగా ఎంఐఎం, కాంగ్రెస్, బిజెపి ప్రచారం

చార్మినార్, నవంబరు 19 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికల్లో బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకరవ్గంలో రాజకీయ వాతావరణం రసవత్తంగా మారింది. ఎన్నికల ప్రచారానికి సమయం దగ్గర పడుతుండటంతో బహదూర్‌పుర నియోజకవర్గంలో ఏఐఎంఐఎం, బిజెపి, కాంగ్రెస్ ప్రధాన పార్టీలు నియోజకరవ్గంలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. 2009 సంవత్సరంలో చార్మినార్ నుంచి విడి పోయి కొత్తగా బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014, 2018 సంవత్సరాలలో మహ్మద్ మోజంఖాన్ బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు శాసన సభ్యులుగా గెలుపొందారు. మూడు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో మహ్మద్ మోజంఖాన్‌కు 96993 ఓట్లు, టిఆర్ఎస్ అభ్యర్థి మీర్ ఇనాయల్ అలీ బాక్రీకి 14,475 ఓట్లు, బిజెపి అభ్యర్థి హనీఫ్ అలీకి 7391 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి షేక్ కలీముద్దీన్ బాబాకు 7.174 ఓట్లు లభించాయి. బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఆరు డివిజన్‌లలో ఎంఐఎం కార్పొరేటర్లు జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలు పొందారు. బహదూర్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఐఎంకు గత మూడు ఎన్నికల్లో కంచుకోటగా నిలిచింది. ఇక్కడ ఎంఐఎంకు గట్టి బలం ఉంది. నియోజకవర్గంలోని కిషన్‌బాగ్, కొండారెడ్డిగూడ, సున్నేకాబట్టి, అసద్‌బాబానగర్, తాడ్‌బన్, రంనాస్‌పుర, తీగలకుంట, ముస్తాఫానగర్, జహనుమా, వట్టెపల్లి, బిలాల్‌నగర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, మకా 2కాలనీ, నవాబ్‌సాహెబ్‌కుంట, కాలాపత్తర్, ఇంద్రానగర్, అలీనగర్, జూపార్కు, మీరాలం, బిర్యానీషాటేకిరి, ఓవైసీనగర్, రంజన్‌కాలనీ, మిశ్రీగంజ్ ప్రాంతాలలో తొంబై ఐదు శాతం వరకు మైనార్టీలు ఉన్నందున గత మూడు ఎన్నికల్లో ఇక్కడ ఎంఐఎం భారీ మెజార్టీతో విజయం సాధించింది. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో బహదూర్‌పుర నియోజకవర్గం ఎంఐఎంకు కంచుకోట. నియోజకవర్గంలో ఎక్కువ శాతం మురికి వాడలు ఉన్నాయి. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలు పొందిన మహ్మద్ మోజం ఖాన్‌కు 2023 ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ లభించలేదు. ఆగాపుర, రెండు సార్లు రంనాస్‌పుర, ప్రస్తుతం శాస్త్రిపురం నుంచి డివిజన్ కార్పొరేటర్‌గా కొనసాగుతున్న మహ్మద్ ముబీన్‌ను అభ్యర్థిగా ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. తీగలకుంట ప్రాంతానికి చెందిన ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ ముబీన్ రెండు సార్లు రంనాస్‌పుర డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలవటంతో నియోజకవర్గంపై మంచి పట్టు ఉంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన యువకుడు, న్యాయవాది, టిపిసిసి ఎన్నికల కోఆర్డినేటర్ పులిపాటి రాజేష కుమార్ (రాహల్)కు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కేటాయించింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్ల నుంచి రాజేష్ కుమార్ పని చేస్తున్నారు. బిసి కులానికి చెందిన రాజేష్ కుమార్‌కు మొదటి లిస్ట్‌లో టిక్కెట్ లభించటంతో స్థానిక నాయకులతో కలిసి నియోజకవర్గంలో జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బహదూర్‌పుర నియోజకవర్గం టిక్కెట్ ఆశించిన షేక్ కలీముద్దీన్ పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడటంతో పార్టీ అధిష్టానం కలీం బాబాను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అలియాబాద్ ప్రాంతానికి చెందిన బిసి కులానికి చెందిన వై.నరేష్‌ను బిజెపి ఎన్నికల బరిలోకి దింపింది. శాలిబండ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసిన నరేష్ బహదూర్‌పుర నియోజకవర్గం యువమోర్చ కన్వీనర్‌గా, బిజెపి కన్వీనర్‌గా పని చేశారు. వి జయం కోసం బిజెపి అభ్యర్థి వై.నరేష్ పార్టీ తరుపున ప్రచారం చేస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ ఏర్పడి నప్పటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్న మాజీ సెట్విన్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ రెండవ సారి బహదూర్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. బహదూర్‌పుర నియోజకవర్గంలో పన్నెండు మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో 315180 మంది ఓటర్లు ఉండగా 288 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎంఐఎం, బిజెపి, కాం గ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు జోరుగా ప్రచారాన్ని నిర్వహిస్తుండగా మిగత పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల ప్రచారం అంతంత మాత్రమే.


ఎంఐఎం - మహ్మద్ ముబీన్


కాంగ్రెస్ - పులి పాటి రాజేష్ కుమార్ (రాహుల్)


వై.నరేష్ - బిజెపి


బిఆర్ఎస్ - మీర్ ఇనాయత్ అలీ బాక్రీ

## ఓటేస్తూ సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారంటే..
# చిక్కుల్లో పడ్డట్లే!

ఓటింగ్ అనేది అత్యంత రహస్య ప్రక్రియ. ఓటర్లు నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని రాజ్యాంగం చెబుతోంది. కానీ వేసిన ఓటు ఎవరికి వేసారో అత్యంత రహ్యంగా ఉంచి ఓటరు మహాశయుని హక్కుకు భంగం కలగకుండా చూడాలి. అయితే కొందరు ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ దగ్గరే నిలబడి సెల్ఫీ ఫొటోలు తీస్తూ..దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. మరికొందరైతే..ఓటేస్తూ సెల్ఫీలు తీసుకొని వాటిని సోషల్ మీడియాలతో వైరల్ అవడానికి పోస్ట్ చేస్తూ చిక్కుల్లో పడుతుంటారు. అలాంటిది ఇప్పుడు అలా సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసారో నేరుగా జైలుకే వెళ్లాల్సి వస్తుంది. యస్.. మీరు విన్నది నిజమే.



హైదరాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త : ఒక మరోవైపు సోషల్ మీడియా వినియోగం పెరగడంతో సెల్ఫీలు దిగి ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసే వారి సంఖ్య కూడా పెరిగింది. ఇక కూర్చున్నా, నిల్చున్నా, తింటున్నా.. ఇలా చేసే పనేదైనా సెల్ఫీ దిగడం అనవాయితీగా మారి పోతుంది. దిగిన సెల్ఫీని స్నేహితులతో పంచుకోవడం ఎక్కువైంది. నిషేధిత ప్రాంతాల్లోనూ సెల్ఫీలు దిగుతున్న వారు కోకొల్లలు. అయితే ఈ అలవాటును ఓటేసే టప్పుడు చూపించొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే పోలీంగ్ కేంద్రాల వద్ద సెల్ఫీ దిగడం వరకు ఒకే కానీ..లోపలికి ఫోన్ తీసుకెళ్లి, ఓటేస్తూ ఫొటో దిగినా చిక్కుల్లో పడతారని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్ తీసుకెళ్లడంపై ఎలక్షన్ కమిషన్ బ్యాన్ విధించింది. పొరపాటున లేక సిబ్బంది కళ్లుగప్పి లోపలికి ఫోన్ తీసుకెళ్ల సెల్ఫీ దిగారో ఒక మీ జీవితం జైలు పాలవుతారని హెచ్చరి స్తుంది. మీరు..ఓటేస్తూ సెల్ఫీ దిగినా..దానిని సోషల్ మీడియాలో ఆఫ్ లోడ్ చేసినా మీ ఓటును పరిగణనలోకి తీసుకోరని తెలిపింది. కాగా..నిబంధనలు అతిక్రమించినందుకు పోలీస్ కేసు నమోదు చేస్తారు. అంతేకాదండోయ్..ఆపై జైలు కెళ్లడం, కోర్టుల చుట్టూ తిరగడం తప్పదు. ఒక మరోవైపు కళ్లు కనిపించని వారు ఓటేసేందుకు సహాయకుడిని అనుమతిస్తామని చెబుతున్నారు. కాగా.. అప్పటికే ఓటు హక్కును వినియోగించుకున్న వ్యక్తినే సహాయకుడిగా అంగీకరిస్తామని చెబుతు న్నారు. సదరు ఆంధుడు ఎవరికి ఓటేశా డనే విషయాన్ని బహిరంగ పరచబోనని సహాయకుడిగా వెళ్లే వ్యక్తి ధృవీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అందుకే మన ఓటు మనం వేస్తే చాలు అందరికి పంచుకుందామని ఒక వేళ లోపలికి వెళ్లి సెల్ఫీ దిగారో జైలులో ఊచలు లెక్కపెడతారు చూసుకోండి జాగ్రత్తగా ఉండండి.

## జాగురూకతతో, అప్రమత్తంగా వ్యవహరించాలి


యజ్ఞపూజ అనంతరం మాట్లాడుతున్న సద్గురు ఋతేశ్వర జీమహారాజ్

అప్జల్‌గంజ్, నవంబర్ 19ప్రభాతవార్త: ప్రతి హిందు సనాతన ధర్మం, భారతీయతను, నాశనం చేసే వారి పట్ల జాగురూకతతో, అప్రమత్తంగా వ్యవహరించాలని సద్గురు ఋతేశ్వర జీమహారాజ్ పిలుపునిచ్చారు. గోషామహల్ నియోజకవర్గంలోని సీతారాంబాగ్‌లోని చారిత్రత్మాకమైన రామ ఆలయంలో నిర్వహిస్తున్న యజ్ఞ పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. యాగాశాల చేరుకున్న ఋతేశ్వర జీ మహారాజ్‌కు యజ్ఞ నిర్వాహకులు మాధవిలత స్వయంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి మాధవిలత మహత్తరమైన యజ్ఞ కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఎళ్లవేళ్లాల తమ ఆశీస్సులు ఉంటాయన్నారు. 27వతేదిన నిర్వహించే కార్తీక ఫౌర్ణమి సందర్భంగా యజ్ఞ పూజ కార్యక్రమాలు ముగిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత, విశ్వహిందు పరిషత్తు నాయకులు రామారాజు, భజరంగ్‌దళ్ సంయుక్త, ఆంధ్ర ప్రదేశ్ మాజీ అధ్యక్షులు యమన్‌సింగ్‌తోపాటు ప్రమోద్‌కుమార్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## పాటతో మానసిక ఉల్లాసం

చిక్కడపల్లి, నవంబరు 19 ప్రభాతవార్త: పాట మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తుందని సుప్రసిద్ధ నేపథ్య గాయనీ, నంది అవార్డుగ్రహీత సురేఖ మూర్తి అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ అధినేత టి.రామోజీ ఆధ్వర్యంలో తెలుగు-హిందీ సినీసంగీత విభావరి కార్యక్రమం జరిగింది.

## దళితుల మధ్య చిచ్చుపెడుతున్న
# బిజెపిని ఎన్నికల్లో బొందపెడతాం

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరిక**

సైఫాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: దక్షిణాది రాష్ట్రాలలో ఒక వర్గం ఓట్లు కోసం దళితుల మధ్య చిచ్చుపెడుతున్న బిజెపిని రాజకీయంగా బొందపెడతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. తెలంగాణలో బిజెపి విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎక్కడా ఎస్సీ వర్గీకరణ చేస్తామని పేర్కొనలేదని, వర్గీకరణపై చిత్తశుద్ధి లేదని దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలోని ప్రజలు తరతరాలుగా ఓటు బ్యాంకు కాంగ్రెస్ పార్టీ వైపు ఉందని, దళితుల్లో ఒక వర్గం వారి ఓటు బ్యాంకు కోసం ఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగను పావుగా వాడుకుని దళితులు మధ్య చిచ్చుపెడుతున్న బిజెపికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టవచ్చుకదా అని అన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీతో వర్గీకరణ విషయంపై మాట్లాడించారని, కాని ఎంపిలైన బండి సంజయ్, డా.కె.లక్ష్మణ్‌తో పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడించలేకపోయారని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ అశయాలకు వ్యతిరేకంగా బిజెపి పనిచేస్తున్నదని, మాదిగలకు కేటాయించిన 16 స్థానాల్లో ఒక్క సీటు కూడా బిజెపి గెలవలేదని ఆయన ఒక ప్రకటనలో జోస్యం చెప్పారు.

## ఉద్యమ కారుల మద్దతు ఈ నెల 23న ప్రకటిస్తాం
**నల్లారాధాకృష్ణ**


మాట్లాడుతున్న టీయూ జేఏసీ చైర్మన్ నల్లారాధాకృష్ణ

నాచారం, నవంబర్ 19 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఉప్పల్ నియోజక వర్గం కమిటీ యొక్క మద్దతు ఇప్పటి వరకు ఏ పార్టీకి ప్రకటించలేదని ఈ నెల 23న తెలియజేస్తామని తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ చైర్మన్ నల్లారాధా కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు నాచారంలోని టీయూజేఏసీ కార్యాయంలో ఉప్పల్ నియోజక వర్గం టీయూజేఏసీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ నల్లారాధాకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు తమ మద్దతు కోరారని అయితే తాము ఎవరికి హామి ఇవ్వలేదన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ఏ పార్టీ మ్యానిఫెస్టో అనుకూలంగా ఉందో చూసి నిర్ణయం తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం జేఏసీ చైర్మన్ కనుకుంట్ల విజయ్‌కుమార్, మల్లాపూర్ చైర్మన్ పొన్నజు వినోద్ కుమార్, ఉప్పల్ చైర్మన్ కరుణాసాగర్, చైర్మన్లు బాలాజీ నాయక్, ఏనుగుల శివ, పద్మారావు ముదిరాజ్, క్రిష్ణ, మధు, సతీష్, లింగస్వామి, నజీర్, అశోక్‌కుమార్, చిన్నరాములు, మల్యాద్రి తధితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖాయం: కోట నీలిమ


బన్సీలాల్‌పేట్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ

సికింద్రాబాద్, నవంబర్ 19 ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధించాల్సి న అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు చర్చిలను ఆదివారం సందర్శించారు. అనంతరం బన్సీలాల్‌పేట్‌లో ఐడీహెచ్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ తాను సనత్‌నగర్‌లోనే ఉంటానని ఎక్కడికి వెళ్ళే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సనత్‌నగర్ ప్రజల ప్రేమాభిమానాలు ఎంతో గొప్పగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీలను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఇక్కడి ఎంతమందికి డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చారని ప్రశ్నించారు. బస్తీ వాసులకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు కూడా అందించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చూసి అధికార పార్టీ నోళ్లు మూతలు పడ్డాయని అన్నారు. ప్రజా సంక్షేమ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా మేనిఫెస్టో తయారైందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయం అయ్యిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ కార్యాక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, రమేష్ మల్లం రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను మోసం చేస్తున్న పార్టీలను
# బుద్ధి చెప్పేందుకు బిసిలనే గెలిపించుకుందాం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నీల వెంకటేష్, సుధాకర్, రాజేందర్

సైఫాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలను మోసం చేస్తున్న రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు పోటిలో ఉన్న బిసి అభ్యర్థులనే గెలిపించాలని బిసి యువజన, విద్యార్థి, మహిళా, మేధావి, వివిధ బిసి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్, బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పి.సుధాకర్, కన్వీనర్ సి.రాజేందర్ తదితరులు మాట్లాడుతూ పఠాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిఎస్‌పి అభ్యర్థిగా పోటి చేస్తున్న బిసి సామాజిక వర్గానికి చెందిన నీలం మధును అత్యధిక మేజారిటితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బిసిలను మోసం చేసిన బిఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు పార్టీలకు అతీతంగా బిసి అభ్యరులనే గెలిపించుకోవాల్సిన సమయం అసన్నమైందన్నారు. ఈ మేరకు వారు బిసి అభ్యర్థుల గెలుపుకోసం ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బిసిల ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తూ బిసి అభివృద్ధి, సంక్షేమం కోసం తపించే నీల మధును రాజకీయ పార్టీలకు అతీతంగా గెలిపించుకుని అగ్రకులాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. తెలంగాణలోని బిసి కులాలన్ని నీలం మధుకు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో బిసి నేతలు దీపిక, శివకృష్ణ, అనంతయ్య, నీలం సైదయ్య, స్వామి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి జాబితా నుంచి తొలిగించిన
# 26 కులాలను వారం రోజుల్లోగా చేర్చాలి

**అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది త్వరలో ప్రకటిస్తాం : రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, రామకృష్ణ, సత్యనారాయణ, వెంకటేష్, రాజేందర్ తదితరులు

సైఫాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: బిసి జాబితా నుంచి 26 కులాలను తొలగించి అన్ని విధాలుగా అన్యాయం, ద్రోహం చేసిన రాజకీయ పార్టీలను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బొందపెడతామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బిసి జాబితా నుంచి తొలగించిన ఈ 26 కులాలను తిరిగి బిసి జాబితాలో వారం రోజుల్లోగా సిఎం కెసిఆర్ చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్రం తొలగించబడిన 26 బిసి కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. తొలగించబడ్డ 26 కులాల పిల్లలు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఇప్పటికే ఎంతో నష్టపోయారని, తల్లిదండ్రులు బిసిలుగా ఉంటే పిల్లలు ఓసిలుగా ఎలా అవుతారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బిసిలను విభజించి అధికారంలోకి వస్తామంటే బిసిలు చూస్తూ ఊరుకోరని తరిమి కొడతారని హెచ్చరించారు. రాష్ట్రంలోని కోట్లాది మంది బిసిలంతా ఐక్యమై బిసి వ్యతిరేక విధానాలకు పాల్పడే రాజకీయ పార్టీలకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే విషయాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిల దగాకోరు, మోసకారి సిఎం కెసిఆర్‌ను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కెసిఆర్‌ను ఓడించేందుకు కెసిఆర్ మోసాల చిట్టా 'ఒక కెసిఆర్ 100 అబద్దాలు' పేరుతో లక్షలాది కరపత్రాలను ముద్రించి పంపిణి చేస్తామన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, నాయకులు సి.రాజేందర్, పి.సుధాకర్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర డివిజన్‌లో విజయారెడ్డి ఇంటింటి ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న వియజారెడ్డి

ఫిల్మ్‌నగర్, నవంబర్ 19, ప్రభాతవార్త : ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్, నంది నగర్, దూత్కనబస్తీ, బంజారా హిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల కార్డును ప్రజలకు తెలియజేస్తూ, బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలను బిఆర్ఎస్ బంధులాగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చుకుంటూన్నరని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా చేశారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టుకోవడానికి ఆరు లక్షల రూపాయలు ఇస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విజయారెడ్డి ఆరోపించారు. ఎన్నికల వచ్చాయని ఓట్ల పేరిట మరొకసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి వారికి బుద్ధి చెప్పాలని, పేదలందరికీ కాంగ్రెస్ హయంలోనే న్యాయం జరిగిందని విజయారెడ్డి గుర్తు చేశారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం విడుదల చేసిన 6 గ్యారెంటీలను కరపత్రం ద్వారా విజయారెడ్డి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని మాజీ కార్పోరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, బస్తీ వాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవుడిలో అత్యున్నతమైనవి సహృదయత, సహాయగుణం

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**


ప్రతిభ-ఆప్తమిత్ర పురస్కార స్వీకర్తలతో రమణాచారి, వెంకటరెడ్డి, కృష్ణమూర్తి

నాంపల్లి, నవంబరు 19 ప్రభాతవార్త : మానవుడిలో అత్యున్నతమైనవి, ఉన్నత స్థాయిలో చిరకాలం నిలుస్తూ చిరంజీవులను చేసేవి సహృదయత, సహాయగుణాలేనన్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అవి సంపూర్ణంగా కలిగివున్న గొప్పహృదయుడు గుదిబండి వెంకటరెడ్డి అని, తన 82వప్రాయంలో కూడా వివిధ కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తూ ఈరోజు 8మంది నిష్ణాతులను ప్రతిభ-ఆప్తమిత్ర పురస్కారాలతోపాటు నగదు బహుమతులతో సత్కరించడంవంటి ఎన్నో ప్రోత్సాహక, సమాజ సామాజిక సేవలను చేయడం హర్షదాయకమని ప్రశంసల వర్షం కురిపించారు. జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డా. పి.కృష్ణమూర్తి సభాధ్యక్షతన రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు సయ్యద్ జానీభాషా, టి.వి.శిరీష, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే కెపి వివేకానంద



పేట్ బషీరాబాద్, నవంబర్ 19, ప్రభాతవార్త : చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో 125 గాజులరామారం డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రషీద్‌బేగ్ ఆధ్వర్యంలో గౌస్-ఈ-అజం సోషల్, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రియాజుద్దీన్ ఖాన్, ముఖ్య సలహాదారులు సమీవుద్దీన్ నూరి, రుస్తుం అలీతోపాటు కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కెపి వివేకానంద సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజవకర్గంలో కుల మత వర్గాలకతీతంగా ఎంతో అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధ చేస్తామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గడిచిన తొమ్మిదేళ్ళ కాలంలో మైనార్టీల విద్య, సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. సయ్యద్ షాజద్ అహ్మద్, ముఫ్తి జహీరుద్దీన్, మొహమ్మద్, మౌలానా, ఆబిద్ ఇక్బాల్, అమీరుద్దీన్ సూరి, రియాజ్ ఖాన్, హాజీ అక్బర్ అలీ రజ్వి, సభ్యులు ముక్తార్ అహ్మద్, మహమ్మద్ కైఫ్ ఖాన్, అజారుద్దీన్‌ఖాన్, మెహ్రాజ్ అలీ, మహమ్మద్ సలీం, సిహ్మాతుల్లా ఖాద్రీ, మొహమ్మద్ ఆలం, మహమ్మద్ ఇర్ఫాన్, మునిరుద్దీన్‌సూరి, మహమ్మద్, వజీం, మహమ్మద్ మెహ్రాజ్, రజీస్ ఖాన్, మహమ్మద్ జాకీర్, ఈర్షద్‌ఖాన్, అబ్దుల్ కలాం తదిరతులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## వరల్డ్ కప్ గెలవాలని ఆలయాల్లో పూజలు

చిక్కడపల్లి, నవంబరు 19 ప్రభాతవార్త: ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న వరల్డ్ కప్ ఫైనల్ పోరులో భారత్ గెలవాలని ఆకాంక్షిస్తూ ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధన మూర్తి పవిత్రమైన అహ్మదాబాద్‌లోని సోమేశ్వరమహాదేవ ఆలయంలో పూజలు నిర్వహించారు. వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు అహ్మదాబాద్ వెళ్లిన సందర్భంగా అక్కడి సోమేశ్వరమహాదేవ ఆలయంలో పూజలు నిర్వహించారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client, Smt.M.Padmavathi has lost the original registered sale deed bearing Doct. No.99/1996 dated 12-01-1996 registered with Office of the Sub-Registrar, Ghatkesar, RR District in respect to the property bearing Plot zno.1868/1 in Survey No.62 and 63 admeasuring 278.3 Sq.Yards (232.7 Sq.Meters) situated at "PRIDE ENCLAVE", Aushapur Village and Gram Panchayat, Ghatkesar Mandal, Ranga Reddy District, bounded by North: 60' wide road, South: Plot No.1868, East Plot No.1992, and West: 33' wide road, My Client Complained with PS, Khairatabad, Hyderabad, in this regard. If anyone finds the original document, they may hand it over to the undersigned. The Public is hereby cautioned not to deal with the said property in any manner.

**KAPPURAM SUJITH**
Advocate
#6-3-570/1, 6th Floor,
Diamond Block,
Rockdale Compound,
Somajiguda,
Hyderabad-500 082.
**Mobilel:9966451222**

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT :: HYDERABAD AT: HYDERABAD**
**O.S.No. 3598 OF 2023**

BETWEEN:
**State Bank of India**
Retail Assets Central Processing Centre (RACPC) -V,
Gunfoundry Branch,
At: Abids, Hyderabad.
Rep. by its Authorised Officer,
...**PLAINTIFF**

AND

**1) Ms. Navreen alias Naureen Ahmed, & Another ...DEFENDENTS**

To
**1) Ms. Navreen alias Naureen Ahmed,** D/o Iftekar Murad Ahmed, Age: 26 Yrs, R/o. C-12/2, Lab Qtrs, DRDO Township, DRDL, Kanchanbagh, Hyderabad-500058
**2) Mr.Iftekar Murad Ahmed,** S/o Murad Ahmed, Age: 54 Yrs, R/o. C-12/2, Lab Qtrs, DRDO Township, DRDL, Kanchanbagh, Hyderabad-500058

Take notice that the above-named plaintiff have instituted the above suit against you for recovery of outstanding amount of **Rs.3,79,611/- (Rupees Three Lakhs Seventy Nine Thousand Six Hundred Eleven Only)** along with interest from the date of suit till the realization together with subsequent interest. You are hereby directed to appear before the **Hon'ble Seventh Junior Civil Judge, City Civil Court Hyderabad at Hyderabad** in person or through your counsel on **28.11.2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence as per law.

//By order of the Court//
**K. JAYARAJ**
**ADVOCATE**

# అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు



కళానగర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి



కల్వంచలో రంగారెడ్డికి తిలకం దిద్దుతున్న మహిళలు

**హయత్‌నగర్, నవంబరు 19 ప్రభాతవార్త:** హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే 90 రోజుల్లో ఆరుగ్యారెంటీలను అమలు చేస్తామని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పల్లె పల్లెకు రంగన్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కళానగర్, పసుమాముల, కుంట్లూర్ గ్రామ పరిధి లోని కల్వంచ(శాంతినగర్), భూదాన్ కాలనీ, రాజీవ్‌గృహకల్పతో పాటు తట్టి అన్నారం, మత్తుగూడ, ఆర్‌కెనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతినెల 2500 చొప్పున ఇవ్వడంతో పాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామని, రైతులకు ఏడాదికి 15వేలు, వ్యవసాయ కూలీలకు 12వేలు, వరి పంటకు 500రూపాయల బోనస్ అందిస్తామన్నారు. ప్రతికుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇల్లులేని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థుకు 5లక్షల విద్యాభరోసా కార్డు, 4 వేల ఫించను, 10లక్షల ఆరోగ్యబీమా అమలు చేస్తామన్నారు. పెద్దఅంబర్‌పేటమున్సిపాలిటీలో మురుగునీటి సమస్య దశాబ్ద కాలంగా ఉందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మురుగునీరు పసుమాముల చెరువుల్లో చేయడంతో దోమలు, దుర్గంధంతో ప్రజలు తరుచు వ్యాధుల భారి న పడుతున్నారని సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యార ని విమర్శించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాల లో ఇళ్లను నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. తట్టిఅన్నారంలో కూడా మురుగు సమస్యకు చర్యలు తీసుకుంటానని, అసంపూర్తిగా ఉన్న తట్టి అన్నారం మర్పల్లి రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తిచేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కమిటీ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్‌పర్సన్, చెవుల స్వప్న, చామ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్లు మల్‌రెడ్డి దీపిక, నాయకులు చిలుక మధుసూదన్ రెడ్డి, చామ రాంరెడ్డి, చామ కృష్ణారెడ్డి, శంకరయ్యగౌడ్, జోర్క శ్రీరాములు, దేవిడి గీతవేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# మాదిగల అభ్యున్నతికి సిఎం కేసీఆర్ కృషి : సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



హయత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్

**మన్సూరాబాద్, హయత్‌నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** దేశ చరిత్రలో మాదిగల అభ్యున్నతికి సంక్షేమానికి కృషి చేసిన ఏకైక నాయకుడు సిఎం కేసీఆర్అని ఎల్‌బినగర్ భారాస పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నా రు. ఎల్బీనగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 60ఏళ్ల కాలంలో ఏ రాష్ట్ర ముఖ్య మంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ముసలవ్వ వరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. బిఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైలు పరిగెత్తుతు న్నాయని అన్నారు. సమాజంలో దళితులకు సమన గౌరవం ఇచ్చే విధంగా వారి జీవితాలు వెలుగు నింపడానికి దేశ చరిత్రలోనే దళితబంధు ప్రవేశపెట్టిన గొప్ప నేత కేసిఆర్ అన్నారు. ఎల్‌బినగర్‌లో గులాబీ జెండా తప్పక ఎగురు తుందన్నారు. మాదిగలు చేపట్టిన కార్యక్రమం ద్వారా బిజెపి పార్టీలో వణుకు ప్రారంభమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడి పాపయ్య, మామిడి రామచందర్, బండారు వెంకటరమణ, మల్లెపాక యాదగిరి పాల్గొన్నారు.

**అభివృద్ధిని చూసి సుధీర్‌రెడ్డిని గెలిపించండి...** ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటువేసి దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ముద్దగోని రామ్మో హన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామతిరుమల్‌రెడ్డి, పార్టీ హయత్‌నగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌సాగర్, నక్క రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# రియల్టర్లు కావాలో లేక ప్రజల పక్షాన ఉండే తాను కావాలో తేల్చుకోవాలి: బిఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి



ప్రచారంలో పసిపాపను ఆశీర్వదిస్తున్న సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితాఇంద్రారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న వాకర్స్

**సరూర్‌నగర్, ఎల్‌బినగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** ప్రజా సేవ ముసుగులో పోటీ చేస్తున్న రియల్ ఎస్టేటర్లు కావాలో లేక నిత్యం ప్రజల మధ్య ఉండి సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించిన తనను ఆదరిస్తారో ఈ ఎన్నికల్లో తేల్చు కోవాలని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్‌అభ్యర్థి, మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బడంగ్ పేట్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లి, రంగనాయకుల కాలనీల్లో పర్యటించి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజల కష్టాలను పట్టించుకోక కనిపించకుండా పోయిన వారిని ఓటర్లు నమ్మవద్దన్నారు. భారీ వర్షాల వరదల్లో ముంపుకు గురైన కాలనీల్లో నేడు పోటీలో ఉన్న నాయకులు ట్రాక్టర్లలో తిరిగితే నేను మాత్రం మోకాలి లోతు నీటిలో తిరిగి ప్రజల కష్టాలను తీర్చానని ఆమె గుర్తు చేశారు. గడచిన 5 ఏళ్లలో ప్రజలతో మమేకమై అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడిన తనకు ఈ ఎన్నికల్లో ప్రజలు అండగా ఉండాలని ఆమె కోరారు. తనను ఆశీర్వదించి ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించి అభివృద్ధి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల నరేందర్‌గౌడ్, యాతం పవన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**బ్రాహ్మణుల సమాజం మద్దతు ఇవ్వాలి: కార్తీక్‌రెడ్డి...** మహేశ్వరం నియోజక వర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి సైతం పెద్ద పీట వేసిన సబితా ఇంద్రారెడ్డి కి మద్దతు ఇవ్వాలని బిఆర్ఎస్ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి కోరారు. నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన తన తల్లితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బ్రాహ్మణ భవనా నికి 1100 గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి నిధులు ఇచ్చిన సబితమ్మను మరువద్దని అన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న బిఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయాచితం శ్రీధర్, వేణుగోపాలచారి, అరవింద్‌శర్మ, మంగు రాఘవరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

**రూపురేఖలు మార్చి గుణాత్మక మార్పులు తీసుకువచ్చాం:మంత్రి సబిత**

పట్టణాల రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసు కు రావడమే బిఆర్ఎస్ పార్టీ లక్ష్యమని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి పేర్కొ న్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వీఎం హోమ్, విజయపురికాలనీ, హుడా కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల సభల్లో ప్రసంగించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలకనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో కెసిఆర్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పారిశుధ్యం, మంచినీటి సరఫరా, రహదారుల నిర్వహణ, పచ్చదనం, నర్సరీ ల ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం, పబ్లిక్ టాయిలెట్ల కోసం అవసర మైన స్థలాల గుర్తింపు వంటి చర్యలను చేపట్టిందని తెలిపారు. మంచినీటి సమస్య తలెత్తకుండా నిరంతరం మంచినీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు సెదదిరేలా, స్వచ్ఛమైన గాలి పొందేలా పార్కుల అభివృద్ధికి, క్రీడా మైదానాల వద్ద సకల సౌకర్యాలు కల్పిం చామన్నారు. చెరువుల వద్ద ఓపెన్ జిమ్‌లు,చిన్నారులు ఆడుకోవటానికి క్రీడా పరికరాలు, పార్కులను అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గములో రూ.40 కోట్లతో అర్బన్‌ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసామని తెలిపారు. కాలుష్య రహిత గ్రీన్ మహేశ్వరం కోసం బాటలు వేసామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల కోసం బస్తి దవాఖనాలను ప్రారంభించి వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీకి అన్ని వర్గాల మద్దతు : బిఎల్ఆర్



బిఎల్ఆర్‌కు మద్దతు ప్రకటిస్తున్న చిలుకానగర్ డివిజన్ ఆర్య వైశ్య నేతలు



సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి మహమూద్‌అలీ, లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, నాచారం, నవంబరు 18 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాలకు తగు న్యాయం జరుగుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేఅభ్యర్థి బండారి లక్ష్మారెడ్డితోపాటు, పార్టీ ఇంచార్జీ రావుల శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు పాల్గొ న్నారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే ఆర్య వైశ్యుల కు న్యాయం జరుగుతుందని, వారికి ప్రత్యేకంగా కమ్యూనిటిహాల్ నిర్మించడం తోపాటు, వారికి తగు చేయూత ఇస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ప్రతి క్షణం అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు లక్ష్మారెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, ఆర్య వైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం : మహమూద్‌అలీ...** బిఆర్ఎస్ పార్టీతో నే ముస్లిం, మైనార్టీల సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నాచారంలోని స్వాగత్ పంక్షన్‌హాల్‌లో జరిగిన ముస్లిం, మైనార్టీ కార్యకర్తల సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహమూద్‌అలీ, బండారి లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం తగు చేయూత అందించిందన్నారు. బిఆర్ఎస్‌తోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందని, పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్‌శేఖర్, ప్రభుదాస్, అరటికాయల భాస్కర్, మల్లికార్జున్‌గౌడ్, ఉప్పల్ ఖాన్, ఆశుబాయ్, లియాఖత్, రఫిక్, ఉస్మాన్, అక్బర్, రషీద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు, దళితుల పక్షపాతి బీజేపీ : ఎల్‌బినగర్ బిజెపి అభ్యర్థి సామ రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

వనస్థలిపురం, సైదాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త : బిజెపి బీసీల పక్షపా తి అని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ బీసీ కులాల సమన్వయ వేదిక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షులు బొమ్మ రఘురాంనేత ఆధ్వర్యంలో ఆదివారం సామ రంగారెడ్డికి మద్దతు ప్రకటిస్తూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. బీసీలకు సముచిత స్థానం కల్పించే ఏకైక పార్టీ బిజెపి అని పేర్కొన్నారు. ఒక బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని సాహసం చేసిన పార్టీ బిజెపి, ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న ఏకైక బిజెపి అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని మాట తప్పిన కేసీఆర్ ఓ వైపు ఉన్నాడని, ఎస్సీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్న మోడి మరోవైపు ఉన్నాడని ఇద్దరిలో ఎవరు కావాలో ప్రజలే నిర్ణయించు కోవాలని సూచించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలలో కమలం పువ్వు గుర్తుకు వేసి సామ రంగారెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాయికోటి పవన్ కుమార్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకులు సుభాష్‌చందర్‌జీ, కొత్త రవీందర్‌గౌడ్, దశరథ్‌సాగర్, ప్రశాంత్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరిక...** నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సామ రంగారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ బీసీ యూత్ వింగ్ నాయకులు క్రాంతియాదవ్, బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు అమర్‌జీ, మల్లేష్, నరేష్, యశ్వంత్, నాగరాజుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు.

# మల్కాజిగిరిలో బిఆర్ఎస్ గెలుపు తథ్యం : బిఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి



బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**మల్కాజిగిరి, 19 నవంబర్ ప్రభాతవార్త :** మల్కాజిగిరి ప్రజలు బిఆర్ఎస్ పార్టీనే గెలిపించనున్నారని మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజ శేఖర్‌రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి చౌరస్తాలో ఆదివారం బిజెపికి చెందిన చిన్న యాదవ్, టిడిపికి చెందిన బత్తిని నరసింహగౌడ్‌లు వారి అనుచరులతో భారీ ఎత్తున సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తలసాని సాయియాదవ్,మర్రి రాజ శేఖర్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరిలో అన్ని వర్గాల ప్రజలు బిఆర్ఎస్ పార్టీని గెలిపిం చేందుకు చూస్తున్నారని నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి మోడ ల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. పార్టీని నమ్మి పార్టీలో చేరేవారికి సముచిత స్థానాలు ఉంటాయని చెప్పారు. ఈ చేరికలకంటే ముందు మల్కాజి గిరి చౌరస్తా నుండి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నందికంటి శ్రీధర్, పార్టీ మల్కాజిగిరి సర్కిల్ ఇంచార్జ్ జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, రాముయాదవ్, ఖలీల్, వెంకన్న, వీరేశంయాదవ్, మురళీధర్, జీకే హనుమంతరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# గెలిపిస్తే మీలో ఒకరిగా ఉండి అభివృద్ధి చేస్తా : కెఎల్ఆర్



జల్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
మరో చిత్రంలో గ్రామ దేవతకు పూజలు చేస్తున్న కెఎల్ఆర్

**సరూర్‌నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని వచ్చా.. తనను ఆదరించి గెలిపిస్తే మీలో ఒకనిగా ఉంటూ ఈ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడుతానని కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన జల్‌పల్లి మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జల్‌పల్లి, శ్రీరాంకాలనీల్లో పాదయాత్రలు చేస్తూ వృద్ధులు, మహిళలు, యువ కులను కలుస్తూ సోనియా ప్రకటించిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. దాదాపు పదేళ్ళ పాటు రాష్ట్రంలో అధికారంలో ఉండి అప్పుల తెలంగాణగా మార్చిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. సంక్షేమం పేరుతో పాలకులు దోచుకున్నారనీ ప్రాజెక్టుల నిర్మాణం పేరిట కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆయన ఆరోపించారు. ఇక రాష్ట్రాన్ని కాపాడేది కేవలం కాంగ్రెస్సేనని ప్రజలు నిర్ణయానికి వచ్చారని ఆయన అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన అంతమై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్నదని అదేవిధంగా మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తానని ఆయన అన్నారు.

**జల్‌పల్లి గ్రామ దేవతకు కెఎల్ఆర్ పూజలు...** ఎన్నికల ప్రచారానికి జల్‌పల్లి మున్సిపాలిటీకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్ స్థానిక గ్రామ దేవత ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం పార్టీ నాయకులతో కలిసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ప్రచారంలో ముందుకు సాగారు. నిరక్షరాస్యులకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ఓపిగ్గా వివరించి ఆయన ఓట్లను అభ్యర్థించారు.

# మహేశ్వరంలో స్థానికుడిని నేనే.. నన్నే గెలిపించాలి: అందెల శ్రీరాములు



మీర్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో స్థాని కుడినైన తనను ఈ ఎన్నికల్లో ఆదరించి స్థానికేతరులకు స్థానం లేకుండా చేయాలని బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ఓటర్లకు పిలుపునిచ్చా రు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప అభివృద్ధి, ప్రజా సంక్షేమం ఉండదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ప్రచా రంలో భాగంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్ రెడ్డి, పసునూరి బిక్షపతిచారిల ఆధ్వర్యంలో ఆర్ఎన్‌రెడ్డినగర్, తిరుమల హిల్స్, సిర్లా, ప్రగతి హిల్స్ తదితర కాలనీల్లో పాదయాత్రలు చేసి గడప గడపకు తిరిగి ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఎర చూపే డబ్బులకు అమ్ముడుపోరనీ వారంతా బిజెపి వైపే ఉంటారని అన్నారు. ఈ ఎన్నికల్లో ధర్మమే గెలుస్తుందనే నమ్మకం తనకు ఉందని ఆయన తెలిపారు. స్థానికునిగా నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న తనను గెలిపిస్తే ప్రజలు సమస్యలు తీర్చి అభివృద్ధి చేస్తాననీ, పెరిగిన ఇంటి పన్నులను తగ్గిస్తానని ఆయన స్పష్టం చేశారు. కాగా అందెల ప్రచారా నికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. మంగళ హారతులతో మహిళలకు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

# కాంగ్రెస్ పార్టీకి తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుల మద్దతు : మధుయాష్కీగౌడ్



మధుయాష్కీగౌడ్‌కు లేక అందజేస్తున్న ఉద్యమకారులు

**ఎల్‌బినగర్, వనస్థలిపురం, నవంబరు 19 ప్రభాతవార్త :** ప్రజల బలం బలగం తో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి తీరుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ అందులకాలనీ, జైపూరికాలనీ యువజన సంక్షేమ సంఘం ప్రతినిధులు,కాలనీవాసులు మధుయాష్కిగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి కేసీఆర్ కుటుంబాన్ని ఇంటికి పంపి చాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయ కులు సుధీర్‌రెడ్డి, మంజులారెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, చిరంజీవి, భవాని, రాంబాబు, వజీర్ నవీన్, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వనస్థలిపురం కార్తీకమాస వనభోజనమహోత్సవం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధు యాష్కీగౌడ్ విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరందరు నా కుటుంబ సభ్యులు, మీ అమూల్యమైన ఓటును హస్తం గుర్తుపై వేసి మీకు సేవ చేసే అవకాశాన్ని నాకు ఇవ్వాలని కోరారు.

**ఉద్యమకారుల సంఘీభావం...** మధుయాష్కిగౌడ్‌కు తెలంగాణ ఉద్యమకారు లు కలిసి తమ సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఆయన గెలుపుకై కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ రామగిరి ప్రకాష్, తొలి మలి దశ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొల్లపల్లి నాగరాజులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలియజేస్తూ ఉద్యమకారులు మధుయాష్కీగౌడుకు లేఖను అందజేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీ గెలుపుకై కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ డాక్టర్ ముత్తయ్య, తొలిమలిదశ తెలంగాణ ఉద్యమకా రుల ఫోరం కోఆర్డినేటర్ గుర్జని వెంకటేశంగౌడ్, అంతటి ధనుంజయగౌడ్, పల్లె వినయ్‌కుమార్, క్రొత్త రవి, శ్రీనివాస్‌గౌడ్ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు




మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో రామానుజ ఆర్ట్స్ కల్చరల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నృత్యోత్సవం నిర్వ హించారు. కళాకారులు స్వాతి, డా.మధుమతి, దశరధ్, రజిత, జ్యోతి తది తరులు వివిధ అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బో శంభో, నమ శ్శివాయతే, నటేశ కౌతం, శివతాండవం,అయిగిరినందిని, అంబ శాంబవి, దశావతారం, కొలువైతివారంగా, సాయి, అదిగో అల్లదిగో, కృష్ణశబ్దం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. అనంతరం కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకు ల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

# వృద్ధులు, వికలాంగులకు హోం ఓటింగ్

**ఎల్‌బినగర్, నవంబరు 19 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల నేపథ్యంలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగులు వారి ఓటు హక్కు వినియోగిం చుకొనుటకు ఫామ్ 12డి సమర్పించిన వారికి హోం ఓటింగ్ ప్రక్రియను 20, 21వ తేదీలలో నిర్వహిస్తామని వీఆర్వో రవీందర్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి 47బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రతి బృందాంలో ఒక్క సెక్టోరల్ ఆఫీసర్, రూట్‌ఆఫీసర్, పోలీస్‌అధికారి, వీడియో గ్రాఫర్ మైక్రో అబ్జర్వర్లు వుంటారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా సోమవారంనుంచి రెండు రోజులపాటు చేపట్టాల్సిన పనులు గురించి ఆదివా రం చైతన్యపురి డివిజన్ ఎలిమినేటి మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో 47 బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో హయత్‌నగర్ తహసిల్దార్ బి.సునీత, నరేష్‌కుమార్, డిటి ఎన్నికలు, సెక్టోరల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు, వీడియో గ్రాఫ్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ విజయం సాధించాలని శ్రీవాణి పూజలు

**ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త :** ప్రపంచకప్‌లో భారత్ జట్టు విజయం సాధించాలని కోరుతూ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ఆధ్వర్యంలో రామంతాపూర్‌లోని కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచకప్‌లో భారత్ జట్టు విజయం సాధి స్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌లలో భారత్ జట్టు తిరుగులేని శక్తిగా ఉందని, ఆదివారం ఫైనల్ మ్యాచ్ గెలిచి కప్ స్వాధీనం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవసాని బాలచందర్, బండారు వెంకట్రావ్, ముత్తినేని జగదీష్, రేవు నరసింహ, కుమారస్వామి, నారాయణదాసు, తిరుపతయ్య, రవి, సాయి, తదితరులు పాల్గొన్నారు.